# అందరూ దైవస్వరూపులే!

**సత్య, ధర్మ, ప్రేమ, శాంతులు లేకున్న**
**విద్యలన్నియు నేర్చిన విలువ సున్న**
**సత్య, ధర్మ, ప్రేమ, శాంతులు లేకున్న**
**దానధర్మాల సార్థకత సున్న**
**సత్య, ధర్మ, ప్రేమ, శాంతులు లేకున్న**
**పదవుల నేలిన ఫలము సున్న**
**సత్య, ధర్మ, ప్రేమ, శాంతులు లేకున్న**
**బహుళ సత్కార్య లాభంబు సున్న**
**ఈ సనాతన ధర్మ హర్మ్యంబు నిలువ**
**గుణము లియ్యవి నాల్గు పునాది గోడలప్ప**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పరతు?**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!**

**ప్రేమస్వరూపులారా!** మానవుడు శాంతిని అనుభవించే నిమిత్తమై జన్మించాడుగాని, పదవుల నేలే నిమిత్తం కాదు. ఎన్ని ఉండినప్పటికీ మానవునికి శాంతి లేకుండిన జీవితమే శూన్యము. ఈ జగత్తులో అనేకమంది శ్రీమంతులున్నారు; కోట్లకొలది విద్యావంతులున్నారు; గొప్పగొప్ప పదవుల నేలినవారున్నారు. కాని, వీరందరివల్ల సమాజానికి కలుగుతున్న ఉపకారమేమిటి? బీదల కష్టాలను తీర్చడానికి వారికి సమయము లేదు. అసలు బీదల పరిస్థితి ఏమిటనే విషయాన్ని ఆలోచించేవారే లేరు. అందరూ 'షో వర్క్' చేస్తున్నారేగాని, 'సోషల్ వర్క్' చేయడం లేదు. 'భవతీ భిక్షాం దేహి' అంటూ ఇంటి ముందుకు వచ్చినవారిని పట్టెడన్నం కూడా పెట్టకుండా 'వెళ్ళిపో' అని కసురుకుంటున్నారు.

**మనిషికి ఏది ముఖ్యము?**

అసలు 'మానవ' అనే పదముయొక్క అర్థమును ఎవ్వరూ గుర్తించడం లేదు. మనిషికి

srisathyasaivachanamrutam

ఏది ముఖ్యము? కోరికలు తీర్చుకోవడమా? ప్రాపంచికంగా అభివృద్ధికి రావడమా? లౌకికమైన ఆనందమును అనుభవించడమా? ఇవేవీ ముఖ్యం కావు. మానవ జీవితంలో సుఖదుఃఖములు రెండూ కలసి ఉంటాయి. కేవలం సుఖమును మాత్రమే అనుభవించాలంటే వీలుకాదు. తోటి మానవునికి తోడ్పడలేనివానికి మనశ్శాంతి ఎలా లభిస్తుంది?! సాటి మానవునికి మనం సహాయము చేయాలి. ప్రతి మానవునికి కష్టసుఖాలు రెండూ ఉంటాయి. అయితే, అవి కదలిపోయే మేఘాలవలె వస్తాయి, పోతాయి. కష్టసుఖములు రెండింటినీ మనం ఒకటిగా భావించాలి. దుఃఖములో ఆనందమున్నది, ఆనందములో దుఃఖమున్నది. సుఖదుఃఖములు రెండూ మానవునికి తప్పునవి కావు. అయితే, జీవితంలో అభివృద్ధిని సాధించాలంటే ఈ రెండింటినీ సమానంగా చూసుకోవాలి. సమానత్వము లేనివాడు మానవుడనిపించుకోడు. సమానత్వము లేనివాడు సమాజంలో ఉండ తగడు. 'సుఖదుఃఖే సమేకృత్వా లాభా లాభౌ జయా జయౌ' అన్నట్లు, సుఖదుఃఖములపట్ల మనం సమదృష్టిని కలిగియుండాలి. కాని, ఈనాటి మానవుడు ఎన్ని సుఖములు అనుభవించినప్పటికీ ఒక్క కష్టము వచ్చిందంటే తట్టుకోలేకపోతున్నాడు.

ఒక శ్రీమంతుని దగ్గరకు వెళ్ళి, 'అయ్యా! మీరు ఆనందంగా ఉన్నారా?' అని ప్రశ్నించండి. అతనేమి సమాధానం చెబుతాడు? 'అయ్యా! నావద్ద కావలసినంత ధనమున్నది. నా కుమారులు గొప్ప పదవులలో ఉన్నారు. నా ఇంట్లో అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. విలువైన వస్తువులున్నాయి. అన్నీ ఉన్నాయిగాని, నాకు మనశ్శాంతి లేదు', అంటాడు. శాంతి లేకపోవడానికి కారణమేమిటి? దోషమెక్కడున్నది? మానవుడు, 'అయ్యా! నీవెవరు? నీవెవరు?' అని ఎదుటి వ్యక్తిని ప్రశ్నిస్తున్నాడేగాని, 'నేనెవరు?' అని తనను తాను ప్రశ్నించుకోవడం లేదు. 'నేనెవరు?' అనే ప్రశ్నకు జవాబు తెలుసుకుంటే తన కష్టాలన్నీ తీరిపోతాయి. తనను తాను తెలుసుకొనక ఎన్ని తెలుసుకున్నా ప్రయోజనం లేదు. "వానలు వచ్చెనంచు భువి పండునె విత్తులు నాటకున్న? వానలు రానిచో భువి పండునె విత్తులు నాటియున్న?" వానలూ రావాలి, విత్తనములూ నాటాలి. నెగెటివ్, పాజిటివ్ రెండూ చేరినప్పుడే కరెంటు ప్రవహిస్తుంది. అట్లే, పురుషప్రయత్నమునకు దైవానుగ్రహము తోడైనప్పుడే ఫలసిద్ధి కల్గుతుంది.

**భగవంతుడు కోరేది**

'ఈశ్వరస్సర్వ భూతానాం', 'ఈశావాస్య మిదం సర్వం'. అట్టి దైవత్వమును విస్మరించి

srisathyasaivachanamrutam

భౌతిక సుఖములకోసం ప్రాకులాడడం వెఱ్ఱితనం. మనం భౌతిక సుఖములను అనుభవించడానికి పుట్టలేదని తెలుసుకోవాలి. ఆధ్యాత్మికములో ప్రవేశించాలి. ఆధ్యాత్మిక దృక్పథము లేనివానికి తాను మనిషినని చెప్పుకోవడానికి అధికారమే లేదు. ఆధ్యాత్మికతను విస్మరిస్తే దైవానికే ద్రోహము చేసినట్లవుతుంది. భగవంతుడు మీరందరూ తనను పూజించాలని ఆశించడు. ఈ జగత్తునకు మీరు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించాలని ఆకాంక్షిస్తాడు. మానవులుగా జన్మించినందుకు మీరు సమాజ శ్రేయస్సుకోసం పాటుపడాలి. సత్కర్మల నాచరించాలి.

ఒకానొక సమయంలో నారదుడు విష్ణువును ప్రశ్నించాడు, 'స్వామీ, జన్మరాహిత్యమును పొందే మార్గమేమిటి?' అని. అప్పుడు విష్ణువు, 'నారదా! నేను అందరియందు ఉన్నాననే సత్యాన్ని గ్రహించాలి', అన్నాడు. మానవుడు దైవస్వరూపుడేగాని, కేవలం దేహస్వరూపుడు కాదు. జీవత్వమనే నెగెటివ్ ఉండటంచేత దైవత్వమనే పాజిటివ్ వచ్చి చేరుతుంది. భగవంతుడు లోకములోని ప్రజలందరితో కలసి మెలగుతూ లోకసంరక్షణ గావించాలంటే తాను మానవ రూపాన్నే ధరించాలి. విష్ణువు చెప్పాడు, 'నారదా! నాయొక్క అంశమే అందరిలోను ఆత్మగా వెలుగొందుతున్నది. ఎక్కడైతే ఆత్మచింతన చేస్తారో అక్కడ నేను తప్పక వచ్చి నిలుస్తాను'.

**దేహియే దేవదేవుడు**

ప్రేమస్వరూపులారా! మీయందున్న ఆత్మయే అందరియందున్నదనే సత్యాన్ని గుర్తించండి. అప్పుడు దైవత్వము మీ ఇంటనే, వెంటనే, జంటనే ఉంటుంది. జీవితమంతా మీరు నెగెటివ్ భావాలతో గడుపుతుంటే మీకు దివ్యత్వమనే పాజిటివ్ ఏనాటికీ లభించదు. దేవుడు సర్వత్రా ఉన్నాడు. కాబట్టి, మీరు దేవునికోసం దేవులాడవలసిన అవసరం లేదు. 'నాయందు కూడా దేవుడున్నాడు' అని విశ్వసించండి. దేవుడంటే ఒక ప్రత్యేక స్వరూపం గలవాడు కాదు. మీరంతా ఆత్మస్వరూపులేగాని, దేహస్వరూపులు కాదు.

దేహము పాంచభౌతికము
　　దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ
　　దేహికి చావు పుట్టుకల్
మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు

sri sathyasai vachanamrutam

నిజంబు జూడ యా
దేహియె దేవదేవుడు
మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ

ఎవరైనా 'నా ఆత్మతత్త్వము మరణించింది' అని చెప్పగలరా! దేహము కూలినప్పటికీ ఆత్మతత్త్వము శాశ్వతంగా ఉంటుంది. పాత్రలో నీరు ఉన్నంతవరకే ప్రతిబింబము కనిపిస్తుంది. నీరు పారబోస్తే ప్రతిబింబము కనిపించదు. ఒక చిన్న ఉదాహరణ. మన ఇంటిలో బావి ఉన్నది. ఇంటిపైన వాటర్ ట్యాంకు ఉన్నది. చెఱువొకటున్నది. నదులు ప్రవహిస్తున్నాయి. సముద్రంకూడా ఉన్నది. వీటన్నింటియందు సూర్యుడు ప్రతిబింబముగా కనిపిస్తున్నాడు. ప్రతి మానవుడు ఒక ప్రవాహమువంటివాడు. ఈ ప్రవాహంలో ఆత్మ అనే సూర్యుడు కనిపిస్తుంటాడు. ఒకే సూర్యుడు సమస్త లోకములకు ఒక్కొక్కడై కనిపిస్తాడు. అమెరికావారికి పగలైనప్పుడు మనకు రాత్రి అవుతుంది. వారికి రాత్రి అయినప్పుడు మనకు పగలవుతుంది. అంతేగాని, ఇండియన్ సూర్యుడు, అమెరికన్ సూర్యుడు అనే భేదము లేదు కదా! కాలములో వ్యత్యాసమున్నదిగాని, సూర్యుడు ఒక్కడే. అదేరీతిగా, ఒకే దైవత్వము అందరియందు గోచరిస్తున్నది. God is one. Truth is one. Love is one. Live in love (భగవంతుడు ఒక్కడే. సత్యమొక్కటే. ప్రేమ ఒక్కటే. ప్రేమలో జీవించండి). మీరు సత్య, ప్రేమలతో జీవిస్తే అన్నింటియందు దైవత్వమును దర్శించగలరు.

**'దైవం మానుష రూపేణ'**

దైవము ఒక్కడే! ఎవరా దైవము? నీవే! ఎవరికి వారు 'నేనే దైవము' అనుకోవాలి. 'నేను దైవాన్ని, నా ఎదుటి వ్యక్తికూడా దైవమే' అనే సమత్వాన్ని విశ్వసించాలి. దీనివలన అహంకారము, ద్వేషము మొదలైన దుర్గుణాలు దూరమైపోతాయి. నీవు ఎవరితోనో జగడము వేస్తున్నాననుకుంటున్నావు. కాని, నిజానికి నీతో నీవే జగడము వేసుకుంటున్నావు. జీవితంలో గెలుపు, ఓటములు మానవునికి సహజం. కనుక, ఓడిపోయినవానిని చిన్నచూపు చూడవద్దు. 'నేనే ఓడిపోయాన'నుకో. ఈరీతిగా నీతో పోల్చుకోకుండా 'అతను పరాయివాడు. అతను వేరు, నేను వేరు' అని అనుకుంటే, అక్కడే భేదము ప్రారంభమవుతుంది.

నీవెవరు? I am the body (దేహమే నేను) అంటారు కొందరు. కాని, దేహము ఎంతవరకు ఉంటుంది? నీటిబుడగవలె ఎప్పుడు పోతుందో ఏమో! ఇటువంటి



sri sathyasai vahamrutam

క్షణభంగురమైన దేహము నీవని భావించవద్దు. I am the mind (మనస్సే నేను) అంటారు కొందరు. అసలు మనస్సంటే ఏమిటి? దానికొక రూపము లేదు. అది కేవలం ఒక Bundle of desires (కోరికల మూట). మన కోరికలే మనస్సుగా రూపొందుతున్నాయి. ఇవన్నీ ఎప్పుడో ఒకప్పుడు దూరమయ్యేవే. ఈనాటి మానవుని మనస్సు క్షణమైనా స్థిరంగా ఉండదు. కనుకనే, దానిని 'మంకీ మైండు' అంటున్నారు. అయితే, నీవు Mankind (మానవజాతి)కి చెందినవాడవు. "నేను మానవుడను. నా మనసు 'మంకీ మైండు' కాకూడదు" అని నీవు గుర్తుంచుకోవాలి. 'దైవం మానుష రూపేణ'. దైవము మనుష్యరూపములో ఉన్నాడు. కాబట్టి, నీవు దేహాభిమానమును దూరం పెట్టి 'నేను దేవుడను' అని విశ్వసించు.

**ప్రతి మనిషియందున్న ఆత్మతత్త్వాన్ని గౌరవించాలి**

రాతిబొమ్మను మందిరంలో ప్రతిష్ఠించి దానికి పూజా పునస్కారములు చేస్తున్నావు. ఆ విగ్రహము ఎక్కడిది? నీవు రూపొందించినదే! నీవు చేసిన విగ్రహానికి పూజలు చేస్తున్నావుగాని, నిన్ను నీవు పూజించుకోవడం లేదే! మనిషి రూపంలో ప్రత్యక్షంగా ఉన్న దైవాన్ని పూజించకుండా ఏదో విగ్రహాలను పూజిస్తే వచ్చే ఫలితమేమీ లేదు. ప్రతి మనిషియందు ఉన్న ఆత్మతత్త్వాన్ని గౌరవించాలి. ఆత్మవిశ్వాసమే నిజమైన విశ్వాసము. విగ్రహాలపై ఉండే విశ్వాసము తాత్కాలికమైనది. తిరుపతికి పోయినప్పుడు దైవాన్ని వేంకటేశ్వరస్వామి రూపంలో పూజిస్తారు. 'వేంకటేశ్వర స్వామి నా కులదైవము', అని కీర్తిస్తారు. బృందావనం వెళ్ళినప్పుడు కృష్ణుని పేరుతో భగవంతుణ్ని పూజిస్తుంటారు. 'కృష్ణుడు మా దైవం' అంటారు. మరి అయోధ్యకు వెళ్ళినప్పుడు 'రాముడు మా దైవం' అంటారు. దేశ, కాల పరిస్థితులను బట్టి అక్కడ ఆయా పేర్లు పుట్టినాయిగాని, భగవంతునికి భేదములు ఏమాత్రము లేవు. ఏ పేరుతో పిలిచినా పలుకుతాడు. రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు, సాయిబాబా అంతా ఒక్కటే. రూపములో ఉన్న వ్యత్యాసమును చూసి భ్రమించకూడదు. రూపము శాశ్వతము కాదు. కనుక, శాశ్వతమైన ఆత్మతత్త్వాన్ని విశ్వసించాలి.

**ఏకత్వము కుదరనంతవరకు చంచలత్వము తప్పదు**

ప్రేమస్వరూపులారా! ఎంతయో ఖర్చు పెట్టి, అనేక కష్టముల కోర్చి మీరిక్కడకు

sri sathyasai vachanamrutam

వస్తుంటారు. ఇన్ని కష్టనష్టములకు గురియై ఇక్కడకు వచ్చిన తరువాత స్వామి బోధనలను మీరు ఆచరణలో పెట్టకపోతే ప్రయోజన మేమిటి? దైవమును ఏకత్వముగా తీసుకోవాలి. అప్పుడే మనకు శాంతి కలుగుతుంది. ఏకత్వము కుదరనంతవరకు మనకు చంచలత్వము తప్పదు. మతములు వేరైనా గమ్యం ఒక్కటే. ఈనాడు ఒక వ్యక్తిని చెడ్డవాడని మీరు విమర్శించవచ్చు. రేపటి దినము అదే వ్యక్తిని మంచివాడని కొనియాడవచ్చు. మంచి, చెడ్డలు మనుష్యులు కల్పించుకున్నవే. మానవుడు సహజంగా మంచివాడే. మానవ జీవితం చాలా పవిత్రమైనది. కనుకనే, 'దైవం మానుష రూపేణ' అన్నారు. ఏ దేవుని చూసినా మనిషి రూపంలోనే కనిపిస్తాడు. అయితే, మనం రూపాన్ని ఆధారము చేసుకోకూడదు. అందులో ఉన్న మహత్తరమైన శక్తిని గుర్తించాలి. మన మనస్సును నిశ్చలంగా పెట్టుకోవాలి. నీకు మనిషి మైండు ఉండాలిగాని, మంకీ మైండు  కాదు. మనిషిగా పుట్టి పశువువలె ప్రవర్తిస్తే ప్రయోజన మేమిటి? నీవు అన్నింటినీ త్యజించి సన్యాసివి కానక్కర్లేదు. మానవ రూపములో ఉన్న దైవాన్ని దర్శించు. దైవము ఎల్లెడలా ఉన్నాడని విశ్వసించు. దైవము ఒకచోట ఉండి, మరొక చోట లేకపోవడమనేది లేదు.

> **సర్వతః పాణి పాదం తత్సర్వతోక్షి శిరో ముఖం**
> **సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి**

**కోరికలే మీ నిజతత్వాన్ని మరుగుపరచుతున్నాయి**

మనం వడ్లను పండిస్తున్నాము. కాని, వాటిని వడ్లుగానే భుజించము; పైపొట్టు తీసివేసి బియ్యంగా మార్చుకుంటాము. పొట్టుతో ఉన్నప్పుడు పునర్జన్మ వస్తుంది. పొట్టు తీసివేస్తే పునర్జన్మ లేదు. మన కోరికలే 'పొట్టు' వంటివి. కాబట్టి, కోరికలను త్యజించినప్పుడే మనము జనన, మరణ చక్రమునుండి విముక్తిని పొందగలము. బియ్యమును బియ్యముగా ఎవ్వరూ తినరు. బియ్యంతో మనం పులిహోర చేస్తాము, చక్కెర పొంగలి చేస్తాము, చిత్రాన్నం చేస్తాము, పాయసం చేస్తాము. బియ్యపు పిండితో దోసెలు చేస్తాము, ఇడ్లీలు చేస్తాము. ఈవిధంగా చూస్తే, ఆహార పదార్థమును బట్టి పేర్లు మారుతున్నాయేగాని, అన్నింటిలో ఉన్నది బియ్యమే. బియ్యము ఒక్కటే అయినప్పటికీ పాకములు వేరు. పొట్టును తీసివేసి వడ్లను బియ్యముగా మార్చుకొని, దానితో అనేకవిధములైన పాకములు చేసుకొని భుజిస్తున్నాము. అదే సంస్కారము. అదేరీతిగా, మన మనస్సునుకూడా సంస్కరించుకుని పవిత్రంగా మార్చుకోవాలి. ప్రతి ఒక్కదానికి సంస్కారం అవసరము. సంస్కారమనగా

srisathyasaivachanamrutam

మంచి మార్పు. ప్రాపంచిక దృష్టిని అభివృద్ధి పరచుకోవడంచేతనే మానవుడు మోసపోతున్నాడు. కాబట్టి, మానవుడు మొట్టమొదట తన దృష్టిని మార్చుకోవాలి. అది తాను మార్చుకోవలసినదే గాని, భగవంతుడు మార్చేది కాదు. భగవంతుడు తన సృష్టిలో అన్నింటినీ పవిత్రంగా, స్వచ్ఛంగా పెడుతున్నాడు. కాని, వాటిని మానవుడే బుద్ధి పూర్వకంగా మార్చుకుంటున్నాడు. తన మనస్సే ఇంత పని చేస్తున్నది. మనోలయమైతే అంతా స్పష్టంగా గోచరిస్తుంది. ప్రేమస్వరూపులారా! మీరు ఎంతో పవిత్ర హృదయులు. కాని, కోరికలనే 'క్లౌడ్స్' (మేఘాలు) వచ్చి చేరి మిమ్మల్ని మాయ చేస్తున్నాయి. మేఘములచేత కప్పబడినప్పుడు సూర్య, చంద్రులు మరుగునపడతారు. అదేరీతిగా, కోరికలనే మేఘాలు అడ్డు రావడంచేతనే మీ నిజతత్త్వాన్ని మీరు దర్శించలేకపోతున్నారు.

**బాల్యమునందున పలువురితో కూడి**
**ఆటపాటలయందు ఐక్యుడగును**
**యవ్వనంబలరిన అలరు విల్తుని పోల్కి**
**కామినీ లోలుడై క్రాలుచుండు**
**అర్ధవయస్సున ఐహికంబున మున్గి**
**ద్రవ్యమార్జించుట దవిలియుండు**
**ముదిమి వచ్చినయంత మురహరి తలవక**
**అది ఇది లేదని అలమటించు**
**వివిధ దుర్వ్యసనంబులు వీడలేక**
**భక్తిమార్గంబు వెతుక ఆసక్తి లేక**
**కర్మపంకిలమున పడి క్రాలుచుండు**
**మట్టి కల్పును జన్మంబు మానవుండు**

జీవితంలో ఎన్ని అనుభవించినప్పటికీ అంత్యము వరకు తాను శాంతిని అనుభవించలేకపోతున్నాడు, మానవుడు. బాల్యము తరువాత యౌవనము, యౌవనము తరువాత వార్ధక్యము వస్తున్నది. వయస్సు మారుతున్నదేగాని, మనస్సు మారడం లేదు. మానవుడు సృష్టిని మార్చడానికి ప్రయత్నించే బదులు తన దృష్టిని మార్చుకోవాలి. సృష్టిని మార్చడానికి ఎవరి తరమూ కాదు. అది భగవంతుని సృష్టి. ఈ సృష్టిలో భగవంతుని సంకల్పముచేత ఏదైనా జరుగుతుంది.

srisathyasaivachanamrutam

**మార్పుచెందేవాటిని నమ్ముకొని మోసపోవద్దు**

మన దేహములో శక్తి ఉన్నంతవరకు ఆటలు, పాటలతో ఆనందాన్ని అనుభవించవచ్చు. అయితే, వాటికికూడా ఒక పరిమితి ఉండాలి. వయస్సు పైబడేకొద్దీ పంచభూతాత్మకమైన దేహము అనేక విధములుగా మార్పు చెందుతుంది. మీకు తెలుసు, ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి గొప్పగా గానం చేసేది. కాని, వయస్సు పైబడిన తరువాత తన కంఠము తనకు సహకరించడం లేదని ఆమె బాధపడుతూ వచ్చింది. ఈవిషయాన్ని నాతో ప్రస్తావించగా, 'దేనినికూడా మనం అధికంగా ఉపయోగపెట్టకూడదు. నీ కంఠాన్ని అధికంగా ఉపయోగించి నీవే పాడు చేసుకున్నావు', అని ఆమెకు చెప్పాను. కంఠముగాని, కంటిదృష్టిగాని అన్నీ కాలక్రమేణ మార్పు చెందునవే! ఈ మార్పుచెందేవాటిని నమ్ముకొని మోసపోవద్దు. మార్పు చెందని ఆత్మతత్త్వాన్ని ఆధారము చేసుకోండి. మానవుడు తనయొక్క దోషములచేతనే తాను కష్టాలకు గురి అవుతున్నాడు. తన ప్రవర్తనను సరిదిద్దుకున్నప్పుడే తాను బాగుపడతాడు. 'నేను మానవుడను. నాకు తిండితీర్థాదులు ప్రధానము కాదు. శీలమే నాకు ప్రధానం', అని భావించాలి. గుణములు సరిలేనప్పుడు మానవుడు ఎన్నో అవస్థలు పడవలసివస్తుంది.

**తుదిశ్వాసవరకు ఒకే దైవంపై మనస్సు నిల్పుకోవాలి**

దివ్యత్వమునకు 'సత్' అని పేరు పెట్టారు. 'సత్' అనగా ఎప్పటికీ ఉండేటటువంటిది. దివ్యత్వమును ఒక్కొక్క మతమువారు ఒక్కొక్క పేరుతో ఆరాధిస్తున్నారు. మహమ్మదీయులు, 'అల్లాహో అక్బర్' అంటారు. అల్లాయే తమకు ఏకైక రక్షకుడని విశ్వసిస్తారు. ముస్లింలకుగాని, హిందువులకుగాని ఎవరికైనా రక్షకుడు భగవంతుడు ఒక్కడే. I want God (నాకు దైవం కావాలి) అని మీరు హృదయపూర్వకంగా చెప్పాలి. మీరు 'డివైన్'ను కోరుకోవాలి గాని, 'డీప్ వైన్'ను కాదు. 'రాముడే నా దైవం' అని ఒక్కతూరి విశ్వసించిన తరువాత జీవితమంతా రామనామస్మరణ కొనసాగించాలి. కాని, ఈనాటి మానవునికి స్థిరమైన భక్తి లేదు. ఈనాడు రాముణ్ణి పూజిస్తాడు. రేపటి దినము ఏదైనా కష్టము వస్తే రాముని ఫోటో తీసేసి కృష్ణుని ఫోటో పెట్టుకొని పూజిస్తాడు. ఒక భక్తుడు నిత్యం శివపూజ చేసేవాడు. నిరంతరం 'ఓం నమశ్శివాయ' అని పంచాక్షరీ మంత్రాన్ని జపించేవాడు. కొంతకాలమునకు ఆ శివుడు తనకేమీ మేలు చేయలేదని భావించి శివుని ఫోటో తీసి బీరువాలో పెట్టేసి రాముని ఫోటో పెట్టుకున్నాడు. రాముని పూజిస్తుంటే కొంతకాలము శాంతిని అనుభవించాడు. కాని, తరువాత అశాంతి ప్రారంభమైంది. రాముని

srisathyasaivachanamrutam

ఫోటోనుకూడా అదే బీరువాలో పెట్టాడు.

గురువుదగ్గరకు వెళ్ళి, 'రాముడు నాకేమీ మేలు చేయలేదు, స్వామీ!' అన్నాడు. ఆయన సలహానుసరించి కృష్ణుని ఫోటో పెట్టుకున్నాడు. నిరంతరము 'గోపాలకృష్ణా' అంటూ జపం చేస్తూ వచ్చాడు. కాని, కొన్ని దినములకు మళ్ళీ అశాంతి రావడంతో ఆ కృష్ణుని ఫోటోకూడా తీసి బీరువాలో పెట్టేశాడు. ఒకనాడు ఒక దేవీ భక్తురాలు వచ్చి, 'అయ్యా! నీవు రాముణ్ణి, కృష్ణుణ్ణి పూజించి ప్రయోజనం ఏమిటి? దేవీ పూజ చేయి', అని సలహా ఇచ్చింది. అతను దేవి ఫోటో పెట్టి, ఊదొత్తులు వెలిగించి, పూజ ప్రారంభించాడు. ఐతే, ఊదొత్తులనుండి వస్తున్న పరిమళం బీరువావైపుకు వెళ్ళడం చూశాడు. 'అయ్యో! నేనీ ఊదొత్తులను దేవికోసం వెలిగించాను గాని, బీరువాలో ఉన్న దేవుళ్ళకోసం కాదే! ఒకరికోసం పెట్టింది ఇంకొకరు అనుభవించడానికి అధికారం లేదు', అనుకొని ఆ ఫోటోలను బీరువానుండి తొలగించాలని నిర్ణయించుకున్నాడు. అప్పుడు దేవి ప్రత్యక్షమై, 'పిచ్చి మానవుడా! ఇదా నీ భక్తి! కొన్ని దినములు రాముణ్ణి పూజించావు. కొన్ని దినములు కృష్ణుణ్ణి పూజించావు. ఇంక, నన్ను ఎన్ని దినములు పూజిస్తావో! ఏనాడు బీరువాలో పెడతావో! ఇది కాదు నిజమైన భక్తి. తుదిశ్వాసవరకు ఒకే దైవముపై మనస్సును నిల్పుకోవాలి. లౌకికమైన జీవితములో వచ్చే కష్టనష్టములకు చలించకుండా ఆధ్యాత్మిక జీవితమును గడపాలి. నీ హృదయములో పవిత్రమైన భావములు అభివృద్ధి కావాలి. అప్పుడే నీవు పవిత్రుడవవుతావు', అని బోధించింది.

నీవు జీవితంలో ఉన్నత స్థితికి రావాలనుకుంటే భగవన్నామాన్ని మరువకుండా, మార్చుకోకుండా స్మరిస్తూ ఉండాలి. ఎలాంటి పరిస్థితిలోనూ నీ మనస్సును మార్చుకోకూడదు. అయితే, మనస్సు కూడా కల్పితమైనదే! 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్నారు. బంధనకు గాని, మోక్షమునకుగాని మనస్సే కారణం. కోరికలవలననే మనస్సు చలిస్తూ ఉంటుంది. కోరికలను నిర్మూలించుకున్నప్పుడే నీవు శాంతిని అనుభవించగలవు. కేవలం దానధర్మాలు చేయడంవలన నీవు మంచివాడవు కాలేవు. అనన్యభక్తితో నిన్ను నీవు దైవానికి అర్పితం చేసుకో. అప్పుడే నీకు అన్నివిధాలుగా శాంతి, సంతోషములు కలుగుతాయి. కోరికలను కంట్రోలు చేసుకో. నీ సంకల్పాలను కంట్రోలు చేసుకో. అప్పుడు జగత్తంతా నీ కంట్రోలులోకి వస్తుంది. సత్యము, ప్రేమ ఈ రెండే శాశ్వతమైనవి. ఇవి నీయందే ఉన్నాయి. 'సత్యాన్నాస్తి పరో ధర్మః'. సత్యమును

srisathyasaivachanamrutam

ఆధారము చేసుకొని ధర్మమును ఆచరించినప్పుడే నీలో ప్రేమ ఆవిర్భవిస్తుంది. ప్రేమయే సర్వ కర్మలను ఫలింపజేస్తుంది.

**సత్య, ప్రేమలను ఆధారం చేసుకోండి**

దివ్యాత్మస్వరూపులారా! నశించే దేహము మీరు కాదు. చావు, పుట్టుకలు లేని దేహియే మీరు. మీ నిజతత్త్వాన్ని మీరు గుర్తించినప్పుడే అమృతత్వాన్ని పొందుతారు; చింతలనుండి విముక్తులవుతారు. 'చింతలు లేనివారు, కోరికలు లేనివారు ఈ లోకంలో ఎవరైనా ఉన్నారా?' అని మీరు ప్రశ్నించవచ్చు. దానికి నేనొక్కడినే సరియైన ఆదర్శము. నాకు ఎట్టి వాంఛలూ లేవు. అన్నీ నా చేతిలోనే ఉన్నాయి. మీకు ఏది కావాలన్నా నేను ఇవ్వగలను. అయితే, మార్పు చెందేవాటిని కోరకండి. ప్రాపంచికమైన విషయాలు, వస్తువులు కదలిపోయే మేఘాలవంటివి. శాశ్వతమైన తత్త్వాన్ని కోరుకోండి. ఈ జగత్తంతటికీ సత్యము, ప్రేమ ఈ రెండే ఆధారం. ఇవి అందరియందున్నాయి. అందరియందున్న సత్యమునే నేను. అందరియందున్న ప్రేమయే నేను. సత్యము, ప్రేమ ఇవి సర్వత్రా వ్యాపించియున్నాయి. కాని, మీకు సత్యము, ప్రేమ అంటే రుచించదు. కేవలం మీ అనుకూలమునుబట్టి మీరు సత్యమును, ప్రేమను ఉపయోగ పెడుతున్నారు. ఈనాడు మీరు గొప్ప అధికారములో ఉండవచ్చు. కాని, ఈ అధికారము ఎంత కాలముంటుంది? దివ్యత్వము ఒక్కటే శాశ్వతమైనది. ఈనాడు ఇట్టి సత్యమార్గములో మీరు ప్రవేశించారు. దీనిని మీరు ఏనాడూ విడిచిపెట్టకూడదు. ఈ సత్యాన్ని మీరు ఏనాడూ మరువకూడదు. దేనిని మరచినా సత్య, ప్రేమలను మరువకూడదు. సత్యము బహిర్వ్యాపిని, ప్రేమ అంతర్వ్యాపిని. ఈ రెండింటినీ మనం కాపాడుకుంటూ రావాలి. అదే మానవునియొక్క నిజమైన కర్తవ్యము. ఈ రెండూ లేకపోతే వాడు మానవుడే కాడు.

ప్రేమస్వరూపులారా! మీ జీవితాన్ని ప్రేమమయం గావించుకోండి. మీ ప్రేమను కేవలం మీ భార్యా బిడ్డలకు మాత్రమే పరిమితం చేయకండి. విశాలమైన భావంతో అందరినీ మీరు ప్రేమించండి. అందరూ భగవత్స్వరూపులే! కాబట్టి, సర్వులకు మీ ప్రేమను పంచండి. సత్యమార్గమును అనుసరించండి. నేను నిరంతరము సత్య, ప్రేమలనే బోధిస్తుంటాను. అందునిమిత్తమే నేను అనేక సభలను జరుపుతుంటాను. మీరు ఇక్కడికి వచ్చి స్వామి సందేశాన్ని విన్నందుకు మీ నిత్య జీవితంలో సత్య, ప్రేమలను ఆచరణలో పెట్టండి. అప్పుడే

sri sathyasai vachanamrutam

నాకు ఆనందము కలుగుతుంది. లౌకికమైన భావాలతో మీ ప్రేమను కలుషితం గావించకండి. ఒక్క దైవతత్త్వముపైననే మీ ప్రేమను ప్రవహింపజేయండి. ఇందుకు రాధయే చక్కని ఆదర్శము.

రాధకు ఆధారం, ధార ఆరాధన. రాధ అనే పేరును త్రిప్పి చదివితే 'ధరా' అవుతుంది. కనుక, రాధ అనగా ప్రకృతి. కృష్ణుడు పరమాత్మ. ప్రకృతి స్వరూపిణియైన రాధ తన ప్రేమను కేవలం కృష్ణపరమాత్మునిపైననే ప్రసరింపజేసింది. ఆమెకు ఏ పూజలూ తెలియవు. కృష్ణచింతన తప్ప ఆమెకు అన్యచింతలు లేవు. కనుకనే, ఆమె ముక్తిని పొందగలిగింది. మీరు ముక్తిని పొందగోరితే ఈవిధమైన మార్గాన్ని అవలంబించాలి.

ప్రేమస్వరూపులారా! నేను అధికంగా మాట్లాడి మీకు శ్రమ కలిగిస్తున్నానేమో! ఇక ఇంతటితో నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. మీరు చేసే ప్రతి పనిని దైవకార్యంగా భావించండి. సర్వత్రా దైవాన్ని దర్శించండి. మీరు ఇట్టి దైవభావములతో జీవితాన్ని గడిపినప్పుడే నేను ఆనందిస్తాను. ఈనాడు మీరు ఇంతమంది ఇక్కడికి వచ్చారు. మీ అందరికీ పవిత్రమైన నా ప్రేమానందమును అందిస్తున్నాను. మీరందరూ 'లాంగ్ లైఫ్', 'హెల్దీ లైఫ్', 'హ్యాపీ లైఫ్', 'పీస్‌ఫుల్ లైఫ్' గడపాలని ఆశీర్వదిస్తున్నాను.

**– శ్రీవారి దివ్యబోధ, తేదీ 23.11.2005 ఉదయం, శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియం**

sri sathyasai vachanamrutam